**Andhra Jyothi**

# 1999 గ్రూప్-2 ఇంటర్వ్యూకి
# మరో 317 మంది

- ఆ తర్వాతే తుది సెలక్షన్: ఏపీపీఎస్సీ
- అమరావతిలో కమిషన్‌కు స్థలం కేటాయించండి: ఉదయభాస్కర్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 1999 నాటి గ్రూప్-2 నోటిఫికేషన్‌లో సర్వీసెస్ ఇంటర్వ్యూలకు కొత్తగా మరో 317 మందికి అవకాశం కలగనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తుది సెలక్షన్ జాబితాపై కొద్ది రోజులుగా కసరత్తు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఈ నిర్ణయానికి వచ్చింది. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి మార్కులు కలిపిన తర్వాతే.. మెరిట్ ప్రకారం తుది సెలక్షన్ జాబితాను విడుదల చేయాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సెలక్షన్స్ చేపడితే దాదాపు వంద మందికి పైగా తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తోందని ఏపీపీఎస్సీ అంచనావేసింది. ఇందుకోసం సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న ఏ ఒక్కరి కొలువు కూడా పోకుండా ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధమవుతోంది. కాగా, సీఎం చంద్రబాబును ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ విజయవాడలో బుధవారం కలిశారు. రాజధాని అమరావతిలో కమిషన్ శాశ్వత భవన నిర్మాణానికి 4 ఎకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఉదయభాస్కర్ తెలిపారు. వివిధ గ్రూప్ రిక్రూట్‌మెంట్లకు సంబంధించి కోర్టు కేసులను, వాటి అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు తెలిపారు. ఏపీపీఎస్సీకి రెగ్యులర్ సెక్రటరీతోపాటు సభ్యులను కూడా త్వరలోనే నియమిస్తామని సీఎం తెలిపారు. ఏపీపీఎస్సీలో ప్రస్తుతం 8 మంది మెంబర్ల ఖాళీలు ఉన్నాయని, అయితే ప్రస్తుతానికి కనీసం 3 నుంచి 5 మంది వరకు నియమించాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు ఉదయ భాస్కర్ వివరించారు.